ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 15 జూలై 2024

ప్రణాళికలు రూపొందించండి..
అభివృద్ధికి సహకరిస్తా

- మంత్రి పొన్నం, ఎమ్మెల్యే గంగులతో చర్చిస్తా
- స్మార్ట్‌సిటీ నిధులు మంజూరు చేయిస్తా
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


బండి సంజయ్‌ని సన్మానిస్తున్న మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లు

కరీంనగర్ టౌన్, జూలై 14: అద్భుతమైన ప్రణాళిక రూపొందించండి.. అభివృద్ధిలో పూర్తిగా సహకరిస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆధ్వర్యంలో అన్ని పార్టీల కార్పొరేటర్లు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ అభివృద్ధి కోసం కృషి చేసి రుణం తీర్చుకుంటానన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తో చర్చిస్తానన్నారు. కరీంనగర్ అభివృద్ధిలో తన మార్కు చూపి స్తానన్నారు. స్మార్ట్‌సిటీ కింద మిగిలిన నిధులు త్వరలోనే మంజూరు చేయిస్తానన్నారు.

కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం కేంద్రం పూర్తిగా సహకరించిందన్నారు. అమృత్ 1 కింద 132 కోట్లు రూపాయలు వచ్చాయని ఆ నిధులతోనే కరీంనగర్‌కు నిరంతరం నీరు ఇవ్వగలుగుతున్నామన్నారు. అమృత్ 2కింద మరో 147 కోట్లు మంజూరైతే కేంద్రం తనవాటా 73.5 కోట్లు ఇప్పటికే విడుదల చేసిందన్నారు. స్మార్ట్ సిటీ మిషన్‌కింద మొత్తం 934 కోట్లు మంజూరైతే అందులో 765 కోట్లు ఇప్పటికే వచ్చాయన్నారు. ఇంకా 176 కోట్లు రావాల్సి ఉందన్నారు. అందులో స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ కింద 100 కోట్ల దాకా రావాలన్నారు. కేంద్రం నుంచి 70 కోట్లు వస్తాయన్నారు. ఇంకో ఏడు నెలలు పదవీ కాలం ఉందని, కష్టపడి పని చేసి మళ్లీ అందరూ గెలవాలన్నారు.ఈ సందర్భంగా బండి సంజయ్‌తో తమకున్న అనుబంధాన్ని పలువురు కార్పొరేటర్లు గుర్తు చేసుకున్నారు. మాజీ డిప్యూటీ మేయర్లు అబ్బాస్ షమి, గుగ్గిళ్ల రమేష్, 30 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు.

కాపువాడలో బండికి ఘన స్వాగతం

కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా పుట్టి పెరిగిన కాపువాడకు రావడంతో స్థానికులు, మున్నూరు కాపు సంఘం నుంచి ఘనస్వాగతం లభించింది. కాపువాడ శివాలయం నుంచి ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తు ర్యాలీగా బయలుదేరారు. పూలమాలలతో స్వాగతం పలుకుతూ బాణాసంచ చప్పుళ్ల మధ్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటి మేయర్ గుగ్గిళ్లపు రమేష్, కాపువాడ అధ్యక్షుడు బొమ్మరాతి రామచంద్రం, కార్యదర్శి ఆకుల యాదయ్య, బొమ్మరాతి వెంకన్న, కళ్యాడపు ఆగయ్య, దగ్గు మహేందర్, రాధాకృష్ణ, రాజేశ్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

భగత్‌నగర్: ధర్మరక్షణే ధ్యేయంగా పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని కాపువాడలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ ఒకే పార్టీ. ఒకే సిద్ధాంతంతో పని చేస్తానన్నారు. కాపువాడ తనకు రాజకీయ జీవితమిచ్చిందని, ఇక్కడి నుంచే అర్బన్ బ్యాంకు డైరెక్టర్‌గా గెలుపొందానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కేసీఆర్ నియంత పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశానన్నారు. అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేసినా జైలులో వేసినా ప్రజల కోసమే పనిచేశానన్నారు.


మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

పర్యావరణ పరిరక్షణకు
మొక్కలు నాటాలి..

జిల్లా అటవీశాఖ అధికారి బాలమణి

కరీంనగర్ అర్బన్, జూలై 14: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఉద్యమంలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) బాలామణి అన్నారు. ఆదివారం లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో అల్కాపురి కాలనీలోని శాంతినివాసం(శ్మశాన వాటిక)లో జరిగిన వనహోత్సవ కార్యక్రమానికి డీఎఫ్‌వో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో బాలమణి లయన్స్‌క్లబ్ ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మొక్కలు దోహద పడతాయని తెలిపారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజి ఆఫీస్ (ఎఫ్ఆర్వో) శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్ ప్రెసిడెంట్ లయన్ ముక్క శరత్ కృష్ణ, కార్యదర్శి లయన్ మ్యాడం శివకాంత్, కోశాధికారి లయన్ బట్టు వినోద్, ప్రోగ్రాం చైర్మన్ సత్యనారాయణ, పీడీజీ కొండా వేణుమూర్తి, బొడ్ల కృష్ణ, లయన్ మెంబర్స్ సింగమరాజు, సాయికాంత్, చైతన్య, ప్రసాద్, రాకేష్, వేణు మాధవ్ పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న డీఎఫ్‌వో బాలమణి

'జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి'

భగత్‌నగర్, జూలై 14: జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస వైద్య సదుపాయాలు పేద ప్రజలకు అందుబాటులో లేవన్నారు. సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వైరల్ వ్యాధులు ప్రబలి ప్రతి కుటుంబంలో జ్వర పీడితులు ఉన్నారన్నారు. ఇబ్బందులు పడుతున్న వారికి వైద్యం అందించడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫీజులు నియంత్రించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్రతి బస్తీలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు సేవలు అందించాలన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.


ఏర్పాటు చేసిన జిమ్

మినీ స్టేడియానికి మోక్షం ఎప్పుడో?

20 ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం

చొప్పదండి, జూలై 14: నియోజకవర్గ కేంద్రమైన చొప్పదండిలో మిని స్టేడియం నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. మినీ స్టేడియం లేకపోవడంతో యువత విద్యార్థులకు ఆటలు ఆడేందుకు క్రీడా మైదనం అందుబాటులో లేక పోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానాన్ని ప్రజలు వ్యాయామం, క్రీడలకు ఉపయోగించుకుంటున్నారు. 20 ఏళ్ల క్రితం చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. పట్టించుకునే వారు కరువు కావడంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమ య్యాయి. ఆ స్థలంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించారు. విద్యార్థులు లేక పోవడంతో ఎత్తేశారు. దీంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. తాజాగా ఈ స్థలంలో వంద పడకల ఆసుపత్రికి కేటాయించారు. మున్సిపల్ శాఖ మంజూరు చేసిన ఓపెన్ జిమ్‌ను జడ్పీ హైస్కూల్ మైదానంలోనే ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చొప్పదండిలో మిని స్టేడియంను నిర్మించాలని క్రీడాకారులు, యువకులు, ప్రజలు కోరుతున్నారు.


చొప్పదండి జడ్పీ హైస్కూల్ మైదానం

కాలుతున్న ట్రాన్స్‌ఫార్మర్లు

- విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- సమస్యను పరిష్కరించాలంటున్న అన్నదాతలు



గంగాధర, జూలై 14: గొర్రె దేవయ్య గంగాధర మండలం వెంకపల్లికి చెందిన రైతు.. గ్రామంలో తన నాలుగెకరాల వ్యవసాయ భూమిలో వరిసాగు చేస్తాడు. ఇప్పటికీ నారు మడికి దుక్కి దున్నలేదు. గత నెలలో పిడుగు పడగా ఈయన పొలం సమీపంలోని 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ముగ్గురు రైతులకు విద్యుత్ సరఫరా అవుతుంది. వీరందరూ విషయం విద్యుత్ అధికారులకు తెలుప గా కనెక్షన్ ఊడదీసి ట్రాన్స్‌ఫార్మర్‌ను గంగాధర మండల కేంద్రంలోకి ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ షెడ్డుకు తీసుకురావాలని సూచించారు. గత నెల 28న రిపేర్ చేసి అమర్చగా రెండురోజులకే తిరిగి కాలిపోయింది. ఇలా ఐదు సార్లు కాలిపోయింది. రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకురావడం, విద్యుత్ శాఖ సిబ్బంది రిపేర్ చేయడం, బిగించిన రెండు రోజులకే కాలిపోవడం.. ఇలా ఐదుసార్లు జరిగింది. ఇప్పటికీ ఒక్క మడిలోనూ నీరు చేర లేదు. ఇలా ప్రతి సారి రిపేర్ షెడ్డు కు తీసుకువచ్చిన సమయంలో ఐదు వేల వరకు ఖర్చవుతోంది.


గంగాధర రిపేర్ షెడ్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

గంగాధర మండలంలో తరచూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని నాగిరెడ్డిపూర్, లక్ష్మీదేవిపల్లి, వెంకంపల్లి, న్యాలకొండయ్యపల్లి, గంగాధర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయిన అధికారులకు సమాచారం అందించిన కనీసం స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. గంగాధరలోని రిపేర్ షెడ్డులో ట్రాన్స్‌ఫార్మర్లు అందు బాటులో లేక పోవడంతో ఇతర మండలాలకు వెళ్లి తీసుకు వస్తున్నారు. దీంతో రైతులపై రవాణా భారం పడి ఆర్థికంగా నష్ట పోతున్నారు.

రైతులపై ఆర్థిక భారం

గంగాధరలోని రిపేర్ షెడ్డులో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదని రైతులు వాపోతున్నారు. రిపేర్ చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను బిగించిన నాలుగు రోజులకే కాలిపోతున్నాయి. ఇటీవల బూరుగుపల్లిలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ మూడుసార్లు, వెంకంపల్లిలో ఇరవై ఐదురోజుల్లో ఐదుమార్లు ఒకే ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందంటే ఏ విధంగా మరమ్మతులు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన ప్రతి సమయంలో రైతులే స్వయంగా ట్రాక్టర్ లేదా ఆటోలో గంగాధరకు తీసుకువచ్చి రిపేర్ అయిన ఐదు రోజులకు తీసుకెళ్లాలి. రవాణా ఖర్చు 6 వేల వరకు అవుతుందని, ఒకే ట్రాన్స్‌ఫార్మర్ తరుచుకాలిపోతుండగా ఆ రైతుల ఆవేదన చెప్పనక్కరలేదు.

ఈ సీజన్‌లో రైతులు కరెంటుతో తీవ్ర ఇబ్బందలు పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగాధర రిపేర్ షెడ్డులో 16 కేవీ సామార్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో లేవు. దీంతో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు తీసుకురావడానికి వెనకడుగు వేస్తున్నారు. అధికారులు రిపేర్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించి ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపట్టాలి

జిల్లా, నియోజకవర్గ, మండలం ఎన్నికలకు ఈనెల 20 గడువు

యువజన కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడు నిలేష్ మోహాడ్

కరీంనగర్ అర్బన్, జూలై 14: సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపట్టాలని యువజన కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడు నిలేష్ మోహాడ్ అన్నారు. ఆదివారం డీసీసీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నిలేష్ మోహాడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 5 వరకు సభ్యత నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ ఎన్నికల బృహత్తర యజ్ఞంలో పాలుపంచుకోవాలని పిలుపు నిచ్చారు. మండల, నియోజకవర్గ, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నామినేషన్ల ప్రక్రియ జూలై 20వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉన్నవారే ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని స్పష్టం చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవికి ఒక సంవత్సరం నిర్విరామంగా పార్టీలో పని చేసిన వారికే అవకాశం ఉంటుందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గం స్థాయి, మండల మండల స్థాయి అధ్యక్ష పదవులకు సైతం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ రెహమాన్, సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్ ఎండీ ఆమెర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్, నాయకులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, అనిల్‌ముదిరాజ్, శ్రావణ్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ నిలేష్ మోహాడ్

వెలవెలబోతున్న చెరువులు

- అడుగంటిన బావులు
- ప్రశ్నార్థకంగా వరి సాగు


వెలవెల బోతున్న నగునూర్ పెద్ద చెరువు

కరీంనగర్ రూరల్, జూలై 14: వరుణ దేవుడి కరుణ కోసం రైతన్నలు ఎదురు చూపులు చూస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా సరైన వర్షాలు లేక చెరువులు, కుంటలు వెలవెలపోతున్నాయి. బావుల్లోకి కొత్తనీరు రాకపోగా ఉన్న నీరు అడుగంటి పోయాయి. నార్లు పోసుకున్న రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో కళకళలాడిన చెరువులు చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి. సకాలంలో వర్షాలు పడితే చెరువులు, కుంటలు నిండి బావుల్లో నీరు నిలువ ఉండేది. ఈసారి వర్షాలు కురవక పోవడంతో మండలంలోని చెరువులన్నీ నీరు లేక బోసి పోయాయి. దీంతో బావుల్లోనూ భూగర్భ జలాలు అడుగంటాయి. గత నెలలో నార్లు పోసుకున్న రైతులు నీరు లేక నాటు వేసే పరిస్థితి లేకుండా పోయింది. పత్తి రైతులకు ప్రస్తుతా నికి కురిసిన వర్షాలు ఊరటనిచ్చినప్పటికి వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది.

కరీంనగర్ రూరల్ మండలంలో 17 గ్రామాల్లో మొత్తం 73 చెరువులు ఉండగా ఇందులో ఐదు పెద్ద చెరువులు, 68 చిన్న చెరువులు, కుంటలు ఉన్నాయి. మొత్తం బావులు 2,719 ఉండగా బోర్లు అధికారికంగా 167 ఉన్నాయి. ప్రస్తుతం మండలంలోని చెరు వులన్నీ నీరు లేక వెలవెలబోతున్నాయి. ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీరు అందుతుందని అనుకుంటే ఎల్లంపల్లి ప్రాజెక్టులో కూడా నీరు లేకుండా పోవడంతో ప్రభుత్వం చెరువులు, కుంటలు నింపలేని పరిస్థితి నెలకొంది. కరీంనగర్ మండలంలో 21 వేల ఎకరాలు వ్యవసాయ భూమి ఉండగా, 19 వేల ఎకరాలు రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 14 వేల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు ఉంది. ఏడు వేల ఎకరాలు కుంటలు, బావుల నీటిని వినియోగించుకుని సాగు చేస్తారు. మరో 15 రోజులు వర్షాలు కురువక పోతే పంటల సాగు ప్రశ్నార్థకమవుతుంది.


నీరు-లేని-గోపాల్‌పూర్, చామనపల్లి చెరువులు

ఎస్సారెస్పీలోకి పెరుగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 3,183 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగు తోంది. ఆదివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతా ల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,183 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.788 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 18.716 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 494 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 7.050 టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని అధికారులు దెలిపారు.

వృద్ధుల సంరక్షణ బాధ్యత పోలీసులదే



మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, జూలై 14: వృద్ధుల సంరక్షణ బాధ్యత పోలీసులదేనని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్ రక్షణ దినోత్సవం ఆదివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్‌ల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసులు తక్షణమేచర్యలు తీసుకుంటారన్నారు. వయోవృద్ధులైన పోషకుల పోషణ చూడకుంటే ట్రిబ్యునల్ అధికారి అయిన ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సెక్షన్ 24 ప్రకారం ఆర్డీవోలకు పోషకులను నిర్లక్ష్యం చేసిన వారిని 6నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అధికారం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు, ప్రతినిధులు నారాయణ, సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది సతీష్‌రాజ్, సింగం గంగాధర్, పబ్బా శివానందం పాల్గొన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించే దమ్ముందా?

- కాంగ్రెస్‌కు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సవాల్ - హరీష్‌రావు బీజేపీలో చేరినా రాజీనామా చేయాల్సిందే..

కరీంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కాంగ్రెస్‌లో చేరుతున్న ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజా తీర్పు కోరే దమ్ముందా అని కాంగ్రెస్ నాయకులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. కరీంనగర్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొందరు ఎమ్మెల్యేలు అక్రమాస్తులు కాపాడుకోవడానికే అధికార పార్టీలో చేరుతున్నారని ఆయన విమర్శించారు. నియోజకవర్గాల అభివృద్ధికోసం కాంగ్రెస్‌లో చేరుతున్నామని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఎనిమిది స్థానాల్లో గెలిపించారన్నారు. అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని మాట్లాడుతున్న అధికార పార్టీ నేతలు మీ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి ఉప ఎన్నికల్లో ప్రజా తీర్పు కోరాలన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనేది ఒక రాజకీయ డ్రామా అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్‌ను విలీనం చేయబోతున్నారంటూ జరుగుతున్న ప్రచారమంతా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆడుతున్న కుట్రలో భాగమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను, దొంగ హామీలను ప్రజలు గుర్తించారన్నారు. నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనే ఇందుకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుకోవడానికి కేసీఆర్, దొంగ హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ నేతలు డ్రామాలు ఆడుతున్నారన్నారు. హరీష్‌రావు మంచి పొలిటీషియన్ అయినా ఆయన బీజేపీలో చేరితే రాజీనామా చేయాల్సిందేనని బండి సంజయ్ అన్నారు. ఎవరు రాజీనామాలు చేసి బీజేపీలో చేరినా గెలిపించుకునే సత్తా మా కార్యకర్తలకు ఉందన్నారు. కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాపాడుకోలేక ఆపార్టీ లీడర్లను ఢిల్లీకి పంపి లీకులిస్తున్నారని విమర్శించారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీనే చిన్న పార్టీ అని గతంలో హేళన చేశారని, ఇప్పుడు బీఆర్ఎస్‌ను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారన్నారు. మాకున్న ఏకైక లక్ష్యం తెలంగాణను అభివృద్ధి చేయడమేనని బండి సంజయ్ స్పష్టం చేశారు. కేసీఆర్ పాలనలో నాతో పాటు మా పార్టీ కార్యకర్తలను ఏ విధంగా హింసించారో, అక్రమ కేసులు పెట్టి జైలులో వేశారో ఎవరూ మర్చిపోలేరన్నారు. అధికార పార్టీ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా జనం నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ వన్‌టైం సెటిల్‌మెంట్ ఏమైందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. కళాశాల యాజమాన్యాలు అనేక ఇబ్బందుల్లో ఉన్నాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోతే విద్యార్థులు అనేక కష్టాలు పడతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

వాహనాల తనిఖీలో గంజాయి పట్టివేత


గంజాయితో యువకుడు

సుల్తానాబాద్, జూలై 14: సుల్తానాబాద్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు గంజాయితో పట్టుబడ్డ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం స్థానిక పూసాల రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పూసాల నుంచి సుల్తానాబాద్ వైపు స్కూటీ వస్తున్న ఓ యువకుడిని పోలీసులు ఆపి తనిఖీ చేయగా అతని స్కూటీలో గంజాయి లభించింది. అతన్ని విచారించగా చంద్రాపూర్ నుంచి గంజాయి తీసుకొచ్చి సుల్తానాబాద్ లో విక్రయిస్తున్నట్లు తెలిపాడని ఎస్ఐ చెప్పారు. అతని వద్ద రైల్వే, బస్సు టిక్కెట్లు, సెల్ ఫోన్ తో సహా 271 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

రాయికల్, జూలై 14: మండలంలోని సింగరావుపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రాయికల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాటస్థావరంపై దాడి చేయగా ముగ్గురు వ్యక్తులు పారిపోగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3810 నగదు సీజ్ చేశారు. ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఉద్రిక్తతకు దారి తీసిన యువకుడి ఆత్మహత్య ఘటన

- ప్రేమ వ్యవహారంలో కొట్టడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి బంధువుల ఆందోళన


లింగన్నపేటలో బైఠాయించిన మృతుడి బంధువులు, పోలీసులు, మృతుడి బంధువుల మధ్య వాగ్వాదం, ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీనాథ్(ఫైల్)

గంభీరావుపేట, జూలై 14: రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో ప్రేమ వ్యవహారంలో తుడుము శ్రీనాథ్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. శ్రీనాథ్‌ను కొట్టడం వల్లే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. కొట్టిన వ్యక్తి ఇంటి ఎదుట శ్రీనాథ్ మృతదేహంతో బంధువులు, గ్రామస్థులు బైఠాయించారు. ఆత్మహత్యకు కారణమైన వారు ఇక్కడికి రావాలంటూ డిమాండ్ చేశారు. అంతకుముందు శ్రీనాథ్‌ను కొట్టిన వారి ఇంటి వద్దకు మృతదేహాన్ని తీసుకువచ్చే క్రమంలో పోలీసులకు, మృతుడి బంధువులకు వాగ్వాదం జరిగింది. గంటకు పైగా పోలీస్‌లతో వారి బంధువులకు వాగ్వాదం జరగడంతో గ్రామంలో ఒక్కసారి వాతావరణం వేడెక్కి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీనాథ్ మృతదేహాన్ని కొట్టిన వ్యక్తి ఇంటి వద్దకు తీసుకువచ్చి ధర్నా నిర్వహించారు. ఈ నెల 10న తుడుం శ్రీనాథ్ (24) అనే యువకుడు ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామ సమీపంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. శ్రీనాథ్‌ను మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు తరలించగా శనివారం సాయంత్రం చికిత్సపొందుతూ మృతి చెందాడు. ప్రేమ వ్యవహారమే శ్రీనాథ్ ఆత్మహత్యకు కారణమని మృతుడి బంధువులు ఆరోపిస్తూ ముందుగా శనివారం అర్ధరాత్రి నడిరోడ్డుపై ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించినప్పటికీ ఆదివారం కూడా ఆందోళన కొనసాగించారు. ప్రేమించిన అమ్మాయి అన్నతో పాటు అతడి స్నేహితులు తమ కొడుకును కొట్టడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని శ్రీనాథ్ తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కొడుకు ప్రేమించిన అమ్మాయితో పాటు కొట్టిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీనాథ్‌ను కొట్టడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ కొట్టిన వారి ఇంటి ఎదుట రోడ్డుపై మృతుడి బంధువులు మృతదేహంతో బైఠాయించారు. శ్రీనాథ్ ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, లేకపోతే ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ పట్టుబట్టారు. ఎస్ఐ రాంమోహన్ సముదాయించినా వినకపోవడంతో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల సీఐ మొగిలి, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట ఎస్ఐలు పోలీస్ బలగాలతో అక్కడికి చేరుకున్నారు. శ్రీనాథ్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ, సీఐ చెప్పడంతో వారి శాంతించారు.

నరసింహుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి పూజలు

ధర్మపురి, జూలై 14: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర హైకో ర్టు జడ్జి జస్టిస్ కె. లక్ష్మణ్ కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం సందర్శించారు. ఆల యానికి విచ్చేసిన ఆయనకు ఆలయ సాంప్రదాయం ప్రకారం మంగళ వాయిద్యాలు వెంట రాగా వేదపండితులు, అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపం డితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహ కరించి ఘనంగా సత్కరించారు. అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. ఆయన వెంట ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కే.లక్ష్మన్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి. స్వామి వారి శేషవస్త్రాలతో సన్మానించి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్, మధు, సంతోష్, సిబ్బంది రాజయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న న్యాయమూర్తి

ఎల్ఎండీలో తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నం

- ఇద్దరిని రక్షించి, కౌన్సెలింగ్ ఇచ్చిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, జూలై 14: కుటుంబ కలహాలతో విసిగిపోయి ఆత్మహత్యకు యత్నించిన తల్లీకొడుకులు మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా అక్కడే విధుల్లో ఉన్న లేక్ పోలీసులు రక్షించారు.

లేక్ అవుట్‌పోస్ట్ ఎస్ఐ అర్షం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌లోని విద్యానగర్ ప్రాంతానికి చెందిన చౌడారపు భారతమ్మ(58), ఆమె కొడుకు చౌడారపు గిరీష్‌కుమార్(34) ఆదివారం మానేరు జలాశయంలోకి దిగేందుకు ప్రయత్నిస్తుండగా అనుమానం వచ్చిన లేక్ పోలీసులు వారిని వెంటనే అదుపులోకి తీసుకుని అవుట్‌పోస్ట్‌కు తరలించారు. అనంతరం కారణాలను అడగగా కుటుంబ కలహాల కారణంగా తాము చనిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తల్లీకొడుకులకు లేక్ అవుట్‌పోస్ట్ ఎస్ఐ సురేష్ కౌన్సెలింగ్ నిర్వహించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇద్దరిని రక్షించిన లేక్ ఎస్ఐ, సిబ్బందిని అధికారులు అభినందించారు.

డెంటల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక


ఎస్ సతీష్ పి రాజు

సిరిసిల్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా డెంటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఎన్నికలకు ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది దంత వైద్యులు పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్ సతీష్, కార్యదర్శిగా డాక్టర్ పి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దంత వైద్యుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తామని సతీష్, రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ శివసంతోష్, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రాజేందర్, డాక్టర్ స్నేహ, డాక్టర్ జవాలి రెడ్డి, డాక్టర్ అకాంక్ష డాక్టర్ సుస్మిత, డాక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్కల దాడి: ముగ్గురికి గాయాలు

సారంగాపూర్, జూలై 14: మండలంలోని రేచపల్లి లచ్చునాయక్ తండాలో పిచ్చి కుక్కలు దాడి చేయడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఆదివారం లచ్చునాయక్ తండా శివారు గ్రామం కొత్తపల్లెకు చెందిన సిరిపెల్లి చంద్రయ్య, బేతాల సంజీవ్, రేచపల్లికి చెందిన సిరికొండ మల్లయ్యలపై దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు అప్రమత్తమై బాధితులను వెంటనే సారంగాపూర్ పీహెచ్‌సీకి తరలించి యాంటీర్యాబిస్ ఇంజక్షన్‌లు వేయించారు. పిచ్చి కుక్కలతో పాటు సాధారణ కుక్కలు వందల సంఖ్యలో ఉన్నాయని వీటిని అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాల పండుగ


రాయికల్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కొడిమ్యాలలో..

రాయికల్, జూలై 14: రాయికల్ పట్టణంలో ఆషాఢ మాసంలో భాగంగా పద్మశాలి సేవా సంఘం, యువజన సంఘం, పోపా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్కండేయ దేవాలయం నుంచి గాంధీ విగ్రహం, బస్టాండ్ మీదుగా పోచమ్మ గుడి వరకు సుమారు 200 మంది మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: కొడిమ్యాల మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● దుర్గమ్మ బోనాలు..

మల్లాపూర్: ఆషాఢ మాసం సందర్భంగా మల్లాపూర్ మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయంలో బోనాల పండుగను నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. సల్లంగా చూడమ్మ దుర్గమ్మ అంటూ భక్తులు అమ్మ వారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు స్థానిక నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయంలోని అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి అనంతరం బోనం సమర్పించారు. జరిగిన కార్యక్రమంలో దుర్గమ్మ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, అంతడుపుల నర్సయ్య, సుంకట నారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, ఎర్ర భూమయ్య, మరిపెల్లి మల్లయ్య, నూతిపెల్లి రాజం, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మల్లాపూర్‌లోని దుర్గమ్మ ఆలయం చుట్టూ ప్రదిక్షణ చేస్తున్న మహిళలు, దుర్గమ్మకు సమర్పించిన బోనాలు

ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ సౌత్ రీజియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీగా పొన్నం రవిచంద్ర



కరీంనగర్ కల్చరల్, జూలై 14: బెంగళూరు సుచిత్ర ఫిలిం సొసైటీలో ఆదివారం జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా వార్షిక సమావేశంలో సౌత్ రీజియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీగా డాక్టర్ పొన్నం రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎఫ్ఎఫ్ఎస్ఎస్ఆర్ కార్యదర్శి డీఎస్ఎస్ ప్రకాశ్ ప్రకటించారు. ఎన్నిక పత్రాన్ని రవిచంద్రకు అందించారు. మూడేళ్ళుగా సౌత్ రీజియన్ అసిస్టెంట్ కార్యదర్శిగా ఉన్న రవిచంద్ర కొన్నేళ్ళుగా ఫిల్మ్ సొసైటీ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ అనేక సినీ వ్యాసాలు రాస్తున్నారు. రవిచంద్ర ఎంపిక పట్ల కఫిసొ కార్యదర్శి కె లక్ష్మీగౌతమ్‌తో పాటు హెచ్ రమేశ్ బాబు, పీవీ రామ్మోహన్ నాయుడు, పీఎస్ రవీంద్ర, అయినంపూడి శ్రీలక్ష్మి, అన్నవరం దేవేందర్, మాడిశెట్టి గోపాల్, గాజోజు నాగభూషణం, కందుకూరి అంజయ్య, నంది శ్రీనివాస్, గాజుల రవీందర్, కెఎస్ అనంతాచార్య హర్షం వ్యక్తం చేశారు.

చీరలు కొని రూ.10 వేలు టోకరా

- ఫేక్ మెసేజ్‌తో మోసం - జగిత్యాలలో ఘటన

జగిత్యాల, జూలై 14: బట్టల షాపులో చీరలు కొని షాప్ ఓనర్ దగ్గర పదివేల రూపాయలను ఓ దుండగుడు కొట్టేశాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 12న జగిత్యాలలోని ఓ బట్టల దుకాణంలో నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై ఓ వ్యక్తి వచ్చాడు. షాపులో రూ.2200 విలువ చేసే మూడు చీరలు కొన్నాడు. తన దగ్గర లిక్విడ్ క్యాష్ లేదని ఫోన్‌పే చేస్తానని చెప్పాడు. అంతేగాక తనకు అత్యవసరంగా డబ్బులు అవసరం ఉందని చెప్పగా ఆ షాపు యాజమానురాలు తన భర్త నెంబర్‌కు ఫోన్ పే చేయమని చెప్పింది. వెంటనే అతడు రూ.10 వేలు ఫోన్ పే ద్వారా ఆమె భర్తకు ట్రాన్సాక్షన్ అయినట్టు ఫేక్ మెసేజ్ ఆమెకు చూపించాడు. ఆమె దగ్గర రూ.10 వేలు తీసుకుని వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. తన ఫోన్ పేకు ఎటు వంటి అమౌంట్ జమ కాలేదని ఆమె భర్త చెప్పాడు. దీంతో తాము మోసపో యామని గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్‌తో సహా బావిలో పడి యువకుడి మృతి


కీర్తి శేఖర్ (ఫైల్)

వేములవాడ రూరల్, జూలై 14: మండలం లోని నూకలమర్రి గ్రామంలో ట్రాక్టర్‌తో సహా బావిలో పడి యువకుడు మృతి చెందాడు. స్థానికులు పోలీసులు కథనం ప్రకారం నూకల మర్రి గ్రామానికి చెందిన కీర్తి శేఖర్ (28) తన బంధువు భూమయ్య పొలం దున్నేందుకు ఆదివారం సాయంత్రం ట్రాక్టర్ తీసుకుని వెళ్లా డు. ట్రాక్టర్‌తో పొలం దున్నే క్రమంలో సమీపం లో ఉన్న బావిలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్‌తో సహా పడిపోయాడు. తీవ్రగాయా లపాలై శేఖర్ మృతిచెందాడు. గుర్తించిన స్థానికులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. బావి నుంచి మృతదేహాన్ని, ట్రాక్టర్‌ను స్థానికులు, పోలీసులు వెలికితీశారు. మృతుడికి తండ్రి చంద్రయ్య, భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుత్ తీగలు పడి రెండు ఆవుల మృతి


విద్యుత్ తీగలు పడి మృతి చెందిన ఆవులు

చందుర్తి, జూలై 14: విద్యుత్ స్తంభాలు విరిగి తీగలు పంట చేనులో మేతమేస్తున్న ఆవులపై పడడంతో రెండు ఆవులు మృతి చెందిన సంఘటన చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తర్రే లక్ష్మణ్‌కు చెందిన రెండు ఆవులు పంట చేనులో మేత మేస్తుండగా విద్యుత్ స్తంభాలు విరిగి తీగలు ఆవులపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన ఆవుల విలువ దాదాపు లక్ష 60వేల పైగా ఉంటయని తెలిపారు. బాధిత రైతును సెస్ అధికారులు ఆదుకోవాలని రైతులు కోరారు.

రామగుండం రైల్వే స్టేషన్‌లో వెండి ఆభరణాలు స్వాధీనం

- ఆపరేషన్ సటార్క్ విజయవంతం
- రైల్వే సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత బెనర్జీ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని రైల్వేస్టేషన్‌లలో ఆపరేషన్ సటార్క్ ఆపరేషన్ పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఈ ఆపరేషన్ ద్వారా రామగుండం రైల్వేస్టేషన్‌లో 51.164కిలోల వెండి ఆభరణాలు ముగ్గురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నామని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మతి బెనర్జీ తెలిపారు. ఆదివారం ఈ ఆపరేషన్ ద్వారా ఆర్పీఎఫ్ బృందం రామగుండం రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండటంతో వెంటనే విచారించి తనిఖీలు చేశామన్నారు. వీరి వద్ద నుంచి బ్యాగులో ఉన్న 51.164 కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్లు తెలుసుకున్నామన్నారు. ఈ ఆభరణాలు ఎక్కడి నుంచి వచ్చాయో ఆ ముగ్గురు వ్యక్తుల నుంచి వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తే పొంతన లేని సమాధానాలు ఇచ్చారన్నారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసి ఆభరణాలను పెద్దపల్లి ఐటీ అధికారులకు అప్పగించామని, ఈ ఆభరణాలు విలువ రూ.47లక్షలు ఉంటుందన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అద్దంకి దయాకర్

మెట్‌పల్లి, జూలై 14: దేశాన్ని ఒకే తాటిపై నడిపించే రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జై భీమ్ సోల్జర్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యవాదుల సమ్మేళనం కార్యక్రమానికి అద్దంకి దయాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి రాజ్యాంగం రచించి, దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు అంబేద్కర్ కృషి చేశారన్నారు. ఒక ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తిగా భావించొద్దని, బడుగు బలహీనవర్గాల కోసం పోరాటం చేసిన ఎన్నో త్యాగాలు చేసిన గొప్ప వారన్నారు. దేశంలోని అన్ని పార్టీలకు అతీతంగా, బడుగుబలహీన పేదరికంలో ఉన్న అన్నివర్గాల కోసం పోరాడిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్‌ను ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తిగా మాత్రమే భావించరాదన్నారు. బీసీ, మైనార్టీలతో పాటు ఎస్సీ వర్గాల ప్రజల కోసం కృషి చేశారన్నారు. అంబేద్కర్ లాగే జ్యోతిరావు పూలే బడుగు బలహీనవర్గాల కోసం ఎన్నో త్యాగాలు చేశారన్నారు. వారి ఆశయ సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బత్తుల నరేష్, రెంజర్ల రాజేష్, అద్దంకి నాగమణి, పేట అశోక్, మేకల తుకారాం, బత్తుల భరత్, శేఖర్, నీరటి శేఖర్, మహిళలు, పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎల్లాపు మహిళా సంక్షేమ సంఘం సభ్యులు

భగత్‌నగర్, జూలై 14: ఎల్లాపు మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చింతకుంటలోని ఎల్లాపు ట్రస్ట్ భవన్‌లో మహిళలు గోరింటాకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు వేడుకలు నిర్వహిస్తామన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా శరీర ఉష్ణోగ్రత మార్పు జరగాలని పూర్వ కాలం నుంచి ఈసంప్రదాయం కొనసాగు తోందన్నారు. ఈకార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు ననువాల హరిప్రియ, గౌరవ అధ్యక్షురాలు వీర్లసరోజన, వీర్ల ఊర్మిళ, పెంచాల రమాదేవి, తాటి ప్రభావతి, లక్కాకుల ఉమ, పెంచాల లావణ్య, వాణి, కృష్ణవేణి, స్వర్ణ, సంధ్య, సుజాత, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో విభజన రాజకీయాలకు తావులేదు



మాట్లాడుతున్న జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

భగత్‌నగర్, జూలై 14: దేశంలో విభజన రాజకీయాలకు ఇక తావులేదని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి టీవీఎస్‌ఎస్ రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఎల్‌ఐసీలోని అతి పెద్ద యూనియన్ అయిన ఎఐఐఈఎ కరీంనగర్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ 28వ మహాసభల్లో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ప్రజలను ఆకర్షించడానికి మతాన్ని అంశంగా ప్రజల్ని అవమాన పరిచేలా వ్యవహరించడం దేశ వ్యాప్తంగా వివాదస్పదమైందన్నారు. ప్రజలు చైతన్యంతో విభజన రాజకీయాలకు తావులేకుండా ఓటు వేశారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది ఒక గొప్పమార్పుకు సంకేతమన్నారు. పరిమితమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం వంద రోజుల్లోనే ఇన్సురెన్స్ రెగ్యులేటర్ ద్వారా తీసుకువచ్చే మార్పులన్నీ ఎల్‌ఐసీని నిర్వీర్యం చేస్తు ప్రైవేట్ ఇన్సురెన్స్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు జి రవీంద్రనాథ్, యూనియన్ జోనల్ అధ్యక్షుడు పి సతీష్, సంయుక్తకార్యదర్శి జి తిరుపతయ్య, కోశాధికారి శ్రీనివాసన్, సికింద్రాబాద్ డివిజనల్‌ప్రధాన కార్యదర్శి రఘు, ఆర్ సత్యనారాయణ, వాసుదేవరెడ్డి, గట్టురాజయ్య, వాసుదేవరెడ్డి, రమేష్, దామోదర్, సత్తయ్య, బుచ్చయ్య, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

●కార్యవర్గం ఏర్పాటు

ఐసిఈయు కరీంనగర్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని మహాసభల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎ.రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షురాలుగా డి.సూర్యకళ, వి వామన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బసవేశ్వర్, సి.అనుపమ, ఆర్.రాజేశం, సంయుక్త కార్యదర్శులుగా యం.శ్రీలత, కోశాధికారిగా రవీంద్రనాథ్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని జోనల్ నాయకులు, డివిజన్ నాయకులు, అన్ని శాఖల నాయకులు ఘనంగా సత్కరించారు.

ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న గౌడ కులస్తులు

కరీంనగర్ రూరల్, జూలై14: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ గ్రామంలో ఎల్లమ్మగుడి వద్ద గౌడ కులస్థుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్ల పాపలందరిని చల్లగా చూడాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం వన భోజనాలు నిర్వహించారు. ఈకార్యక్రంలో గౌడ కులస్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సైదాపూర్, జూలై 14: సైదాపూర్ మండలంలోని పెర్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాలలోని అనుభూతులను - జీవితంలోని అనుభవాలను పంచుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు తమ స్నేహితులను, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను చూసేందుకు తరలి వచ్చారు. పరస్పరం ఆలింగనం చేసుకొని పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలను బహూకరించారు. ఇది 17 ఏళ్ల బంధమని, ఇది ఇలాగే కొనసాగుతుందని ఉద్ఘాటించారు. తమ స్నేహితులను కలవాలన్న సదుద్దేశంతో ఈ సమ్మేళనాన్ని నిర్వహించామని తెలిపారు.

●కరీంనగర్ రూరల్, జూలై14: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో జిల్లా పరిషత్ స్కూల్‌కు చెందిన 1974-75 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆనాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆనాటి రోజులను నెమరు వేసుకున్నారు. తోటి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సంవత్సరం జూలై రెండో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ద్వారా పేద విద్యార్థులకు ఇండ్లు నిర్మించి ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఆనం దంగా గడిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి

చిగురుమామిడి, జూలై 14: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అన్నారు. చిగురుమామిడిలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం, విద్య, వైద్యంతో పాటు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలో అత్యధికంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్‌నేత, మాజీ జడ్పీటీసీ జి రవీందర్, మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్‌సింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



వేంకటేశ్వర కాలనీలో పోచమ్మ బోనాల్లో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు, చింతకుంటలో..

కరీంనగర్ కల్చరల్, జూలై 14: నగరంలోని పలు డివిజన్‌లలో బోనాల జాతరలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు పసుపు కుంకుమలు, వస్త్రాలు, ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని వేడుకున్నారు. వేంకటేశ్వర కాలనీలో జరిగిన పోచమ్మ బోనాల్లో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీవేణు, తోట రాములు, స్థానికులు పాల్గొన్నారు. కిసాన్‌నగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోచమ్మ బోనాల్లో కిసాన్‌నగర్, శివాజీనగర్, పీఎన్ కాలనీ, కార్ఖానగడ్డ ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. మార్కండేయనగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ముత్యాల పోచమ్మతల్లి బోనాల్లో స్థానికులు పాల్గొన్నారు.

●గణేష్‌నగర్: కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో గాంధీనగర్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీరామోజ రవీంద్రచారి, తిప్పారం రవీంద్రచారి, యాదగిరి చారి, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సుభాష్‌నగర్, జూలై 14: జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆదివారం స్థానిక సప్తగిరి కాలనీలో నిర్వహించిన ఈ ఉచిత వైద్యశిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, టుడి ఇకో మొదలగు సూపర్‌స్పెషాలిటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చీటి కార్తిక్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్, గైనకాలజిస్టు డాక్టర్ ప్రతిష్ఠారావు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి సలహాలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ అన్ని రకాల వైద్యసేవలు మెడికవర్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. అంతే కాకుండా సెలవులతో సంబంధం లేకుండా వారంలో ఏడు రోజులు, 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నా మన్నారు. ప్రజలు ఈ వైద్యసేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గడ్డం అజయ్‌రెడ్డి, రఘుమోహన్, జనార్దన్‌రెడ్డి, రవికాంత్, రవీందర్‌రెడ్డి, గీతారెడ్డి, రామానంద్‌తీర్థ, ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రెయిన్ చైన్స్ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, జూలై 14: కవి అన్నవరం దేవేందర్ ఆంగ్ల అనువాద కవితా సంపుటి 'గ్రెయిన్ చైన్స్'ని ఆదివారం ఫిలింభవన్‌లో సాహితీ సోపతి, ఎస్సీ ఫ్రెండ్స్, కవిసో సంయుక్త ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. దేవేందర్ తెలుగులో రాసిన వరి గొలుసులు పుస్తకాన్ని సవ్యసాచి ఆంగ్లంలోకి అనువదించారు. పుస్తకాన్ని బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. కవితా సంపుటిని పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్‌కు అంకితమిచ్చి సన్మానించారు. అనంతరం నలిమెల భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల వ్యవహారిక జీవ భాషలో అన్నవరం రాసిన వరి గొలుసులు కవితలను ఎంతో నేర్పుతో సవ్యసాచి ఇంగ్లీష్‌లోకి అనువదించారని అన్నారు. జీవి శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ స్థానిక భాషలోని గొప్ప కవిత్వాన్ని సార్వత్రిక భాష ఆంగ్లంలోకి అనువదించిన సవ్యసాచి అభినందనీయుడని అన్నారు. కార్యక్రమంలో ఎనిశెట్టి శంకర్, గాజోజు నాగభూషణం, నంది శ్రీనివాస్, రావుల శశిధర్, వేముల సత్యనారాయణ, బూర్ల వేంకటేశ్వర్లు, సీవీ కుమార్, మాడిశెట్టి గోపాల్ పాల్గొన్నారు. అష్టాదశ శక్తి పీఠాల ప్రాభవంపై డాక్టర్ కృష్ణసాహితి చేసిన నృత్యం ఎంతగానో అలరించింది.

కృష్ణవేణికి నారీశక్తి అవార్డు

కరీంనగర్ కల్చరల్, జూలై 14: స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, పీస్ ఆఫ్ ఇండియా ఎన్జీఓ, స్ఫూర్తి సర్వీస్ సొసైటీ, ఇండియా ఎన్జీవో, ఆసియా వేదిక కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్, బొగ్గుల కుంట తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం, గుండ్లపల్లి గ్రామానికి చెందిన గాయకురాలు వంగల కృష్ణవేణికి అంతర్జాతీయ భారతీయ నారీశక్తి అవార్డును ప్రదానం చేశారు. నిర్వాహకులు డాక్టర్ ఆకుల రమేశ్, ఇమ్మిడిశెట్టి రవీందర్, గూడూరి చిన్నారెడ్డి, విజయలక్ష్మి తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రథయాత్ర కమిటీ బాధ్యులు

కరీంనగర్ కల్చరల్, జూలై 14: జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం 1-30 గంటల నుంచి కరీంనగర్‌లో నిర్వహించే జగన్నాథ రథయాత్రకు ప్రజలంతా తరలి వచ్చి జగత్‌ప్రభువు కృపకు పాత్రులు కావాలని కరీంనగర్ ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకుడు నరహరి ప్రభు పిలుపునిచ్చారు. ఆదివారం ఉజ్వల పార్క్ రోడ్‌లో ఉన్న ఇస్కాన్ రాధాగోవింద మందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం 1-30 గంటలకు రాంనగర్ రమా సత్యనారాయణస్వామి దేవాలయం నుంచి యాత్ర ప్రారంభమై మంకమ్మతోట, తెలంగాణచౌక్, బస్‌స్టాండ్, కమాన్, శాస్త్రిరోడ్, టవర్‌సర్కిల్ మీదుగా రాత్రి 7 గంటల వరకు వైశ్యభవన్ చేరుకుంటుందని అన్నారు. భగవంతుడు భక్తుల వద్దకు రావడం గొప్ప విషయమని, రథంలోని స్వామిని దర్శిస్తే సకల పాపాలు తొలగి పునర్జన్మ నశిస్తుందని అన్నారు. స్వామి రథాన్ని లాగితే సకల సుఖ సంతోషాలు కలుగుతాయని తెలిపారు. ప్రజ్ఞాభారతి ప్రతినిధి డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి, రథయాత్ర కమిటీ చైర్మన్ కన్న కృష్ణ మాట్లాడుతూ వైశ్యభవన్‌లో ఇస్కాన్ ప్రతినిధులచే ప్రవచనాలు, ప్రత్యేక పూజలు, నైవేద్య సమర్పణలు, మహాప్రసాద వితరణ ఉంటాయని పేర్కొన్నారు. యాత్రకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంఎల్‌ఏ గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, కలెక్టర్ పమేలా సత్పతి, కార్పోరేటర్లను ఆహ్వానించామని అన్నారు. సమావేశంలో కో కన్వీనర్‌లు తుమ్మల రమేశ్‌రెడ్డి, కోమాళ్ళ రాజేందర్‌రెడ్డి, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, కొమురవెల్లి వేంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



రంగాపేటలో వరి నాటు వేస్తున్న మహిళలు

మానకొండూర్, జూలై 14: మండలంలోని వివిద గ్రామాలలో వానాకాలం వరినాట్లు మొదలయ్యాయి. మండలంలో చెరువులు, కుంటలలో నీరు పూర్తి స్థాయిలో లేకపోవడంతో మండల రైతులు వర్షాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో లోయర్ మానేరు డ్యాం నుంచి కాకతీయ కాల్వల ద్వారా ప్రతీ పంటకు నీటి సరఫరా చేస్తారు. కాగా మండలంలో డీబీఎం 2నుంచి డీబీఎం 7వరకు కాకతీయ ఉపకాల్వల ద్వారా సాగు నీరు అందించేవారు. మండలంలో సుమారు 32వేల ఎకరాల సాగు భూమి ఉంది. కాగా వానాకాలం సుమారు 25వేల ఎకరాలలో వరి పంటను సాగు చేసేందుకు సిద్ధం అయ్యారు. ముంజంపల్లి, రంగాపేట, గంగిపల్లి, కొండపల్కల, అన్నారం, పచ్చునూర్, ఊటూర్, లక్ష్మీపూర్, వెల్ది, లింగాపూర్, దేవంపల్లి, లలితాపూర్ గ్రామాల పరిధిలో వ్యవసాయ బావుల వద్ద నారు పోశారు. వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలలో నీరు లేక వెలవెలబోతున్నాయి. వ్యవసాయ బావుల నారు మడులు సిద్ధం చేసి రోజులు కావడంతో రైతులు నాట్లు వేయిస్తున్నారు. ఇప్పటి నుంచి ఆగస్టు చివరి వరకు రైతులు నాట్లు పూర్తి చేసే అవకాశం ఉంది.

వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తం

- గ్రామ పంచాయతీల్లో పట్టించుకోని అధికారులు

మానకొండూర్, జూలై 14: గ్రామ పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రమైన మానకొండూర్‌లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న స్థానిక గ్రామపంచాయితీ కార్యాలయం ఎదుట విద్యుత్ స్తంభం పగలు రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. పంచాయితీ పాలకవర్గం ఫిబ్రవరితో ముగిసింది. దీంతో ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామపంచాయతీలు కొనసాగుతున్నాయి. సంబంధిత అధికారి చొరువ తీసుకొని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మానకొండూర్‌లో పగలు వెలుగుతున్న వీధి లైట్లు

యథేచ్ఛగా మట్టి తరలింపు

- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు



హుజూరాబాద్‌లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్

హుజూరాబాద్, జూలై 14: హుజూరాబాద్‌లో కొంత మంది అక్రమార్కులు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు నాడే అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా జరుగుతున్న అధికా రులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. హుజూరాబాద్ మండలంలోని రంగాపూర్, రాంపూర్, సింగాపూర్, తుమ్మన పల్లి, బోర్నపల్లి, సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ప్రభుత్వ గుట్టలు ఉన్నాయి. ఈ గుట్టల నుంచి హుజూరాబాద్‌కు చెందిన పలువురు టిప్పర్లతో ప్రభుత్వ మట్టిని అమ్ముకుంటు న్నారు. హుజూరాబాద్‌లో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందుకు మట్టి అవసరం ఉండగా, గుట్టల నుంచి సదరు అక్రమార్కులు టిప్పర్‌కు రూ. 1500 నుంచి రూ. 2వేల వరకు తీసుకొని మట్టిని తరలిస్తున్నారు. సెలవు దినాల్లో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండరనే ఉద్దేశ్యంతో ఇష్టానుసారంగా మట్టిని దోపిడీ చేస్తున్నారు. కళ్ల ముందు నుంచి మట్టి టిప్పర్లు పోతున్న పోలీసులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నా రనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, జూలై 14: మండలంలోని టేకుర్తి గ్రామ శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఏఎస్‌ఐ రవీందర్‌రెడ్డి తెలిపారు. జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామ శివారులోని మానేరు పరివాహక ప్రాంతం నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ట్రాక్టర్ యజమానిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

'ఎంఐఎం కార్పొరేటర్ల దిగజారుడు రాజకీయాలు'

కరీంనగర్ అర్బన్, జూలై 14: ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ల దిగజారుడు రాజకీయాలు ముస్లింల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈద్గాను కూల్చేస్తాం.. మసీదులను తవ్వేద్దాం.. అన్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ వద్దకు ఎంఐఎం కార్పొరేటర్లు ఎలా వెళతారని ప్రశ్నించారు. బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి వచ్చిందని మేయర్ సునీల్‌రావు ఆహ్వానిస్తే ఎంఐఎం కార్పొరేటర్లు వెళ్లి కలవడం ముస్లింల ఆత్మగౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని బీజేపీ ముందు తాకట్టు పెట్టడమేనని, దీనిపై ఎంఐఎం కార్పొరేటర్లు జవాబు చెప్పాలన్నారు. ముస్లింల అభివృద్ధికి తామే పాటుపడుతామని చెప్పుకున్న ఎంఐఎం పార్టీ నాయకులు, కార్పొరేటర్లు ఇస్లాం ధర్మంపై, ముస్లింలపై పదేపదే వేలెత్తి చూపించిన బండి సంజయ్ కుమార్‌ను సన్మానం చేయటాన్ని ముస్లిం సమాజం ఆలోచించాలన్నారు. గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీతో ముస్లింల ఆత్మగౌరవం గాలికి వదిలేసి దిగజారి పోవడం కేవలం ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లకు, నాయకులకు మాత్రమే చెల్లుతుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీకి సహకరిస్తున్న ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు, నాయకుల నిజస్వరూపం ఇప్పటికైనా ప్రజలు గుర్తించి, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు.

ఘనంగా శాకాంబరి ఉత్సవాలు



అలుగడ్డల మాలతో దర్శనమిచ్చిన దుర్గాదేవి

కరీంనగర్ రూరల్, జూలై14: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గ భవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆషాడ శాకాంబరీ ఉత్సవాలలో భాగంగా ఆదివరం అమ్మవారిని అలుగడ్డలు, కరివేపాకు మాలలతో అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష హరతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, కార్పోరేటర్ వంగల శ్రీదేవి, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గణిత ఫోరం ఆధ్వర్యంలో సన్మానం

కరీంనగర్ టౌన్, జూలై 14:గెజిటెడ్ ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి పొందిన జె మనోహర్‌రెడ్డిని తెలంగాణరాష్ట్ర గణిత ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తార్నాకలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్‌లోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన భారతి వివిఎం జిల్లా కార్య నిర్వాహకులు, సలహా దారులు, స్టేట్ కో-ఆర్డినేటర్‌లు, ఎన్‌ఐఎన్ డైరెక్టర్ భానుప్రకాశ్‌రెడ్డి, ప్రదీప్ అగర్వాల్, శ్రీధరాచార్యులు, కందాలరామయ్య, కందికొండ శ్రీనివాస్, స్టేట్ మాథ్స్ ఫోరం అధ్యక్షుడు జెవి నర్సింగరావు, ఎర్రబెల్లి అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సన్మానం

భగత్‌నగర్, జూలై 14: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సైన్స్ కళాశాలలో తనతో పాటు చదివిన ఇంటర్ క్లాస్‌మేట్స్ ఆదివారం పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఇంటర్ క్లాస్‌మేట్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రిని మిత్రులు ఆహ్వానించగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో దాసరి రాజన్‌బాబు, జాలి శ్రీనివాస్‌రెడ్డి, గర్రెకుర్తి నర్సయ్య, నాగభూషణం, శ్రీనివాస్‌బాబు, బంధం మల్లారెడ్డి, వసంతరెడ్డి, సిరిసిల్ల వాసు, కార్పొరేటర్లు నాంపల్లి శ్రీనివాస్, గందె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూరో వైద్య శిబిరానికి స్పందన

హుజూరాబాద్, జూలై 14: హుజూరాబాద్ పట్టణంలోని దుర్గా ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన న్యూరో వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ అంకతి ప్రవీణ్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం పెరక సంఘం ఆధ్వర్యంలో హుజూరాబాద్ నియోజక వర్గానికి చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ ప్రవీణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానిం చారు. కార్యక్రమంలో డాక్టర్ పోతరాజు శ్రీనివాస్, మీస రమేశ్, అంకతి శ్రీనివాస్, ఆకుల వెంకట్రాజం, రజనీకాంత్, కనకయ్య, వెంకన్న, పరమేశ్వర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థి

హుజూరాబాద్, జూలై 14: హుజూరాబాద్ పట్టణానికి చెందిన సముద్రాల వికాస్ సీఏ పరీక్షల్లో ప్రతిభ చాటాడు. హైదరాబాద్‌లోని ఎస్సార్ నగర్‌లోని లక్ష్య ఇన్స్యూట్‌లో సీఏ కోచింగ్ తీసుకొని పరీక్షలు రాశాడు. సందర్భంగా వికాస్‌ను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

మోటర్ సైకిల్ చోరీ

శంకరపట్నం, జూలై 14: శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో శనివారం రాత్రి మోటర్ సైకిల్ చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. తాడికల్ గ్రామానికి చెందిన దున్న నాగరాజు మండలంలోని ఎరడపల్లి గ్రామంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. అక్కడే నివాసం ఉంటు న్నాడు. ఇంటి ముందు నిలిపిన మోటర్ సైకిల్‌ను గుర్తు తెలియని దుండగులు దోచుకెళ్లారు. ఆది వారం తెల్లవారు జామున లేచి చూడగా ఇంటి ముందు ఉన్న మోటర్ సైకిల్ కనిపించలేదు. దీంతో కేశవపట్నం పోలీ సులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వీణవంక, జూలై 14: మండల కేంద్రంతో పాటు చల్లూరులో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను యూఫ్ టీవి సీఈవో పాడి ఉదయనందన్‌రెడ్డి ఆదివారం పరా మర్శించారు. ఆయన వెంట నాయకులు మాజీ జడ్పీటీసీ దాసారపు ప్రభాకర్, నాయకులు మడ్గూరి సమ్మిరెడ్డి, మ్యాకల ఎల్లారెడ్డి, అమృత ప్రభాకర్, ప్రకాశ్, మంతెన శ్రీధర్, లోకేష్, అశోక్, అఖిల్, కుమారస్వామి, రాకేష్, రాజు, మధు, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌కు సన్మానం

జమ్మికుంట, జూలై14: గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఎండీ రియాజ్‌ను హుజూరాబాద్ నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహ్మద్ సజ్జద్ ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రియాజ్‌ను మహ్మద్ సజ్జద్ అభినందించారు.

ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌కు..

ఇల్లందకుంట, జూలై 14: ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిం చిన అయిత ప్రకాష్‌రెడ్డిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంగిలే రామారావు హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఫిషర్మెన్ చైర్మన్ బండి మల్లేష్, నాయకుడు ఎండీ సలీం తదితరులు పాల్గొన్నారు.